నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 12 జూన్ 2024 | HYDERABAD

శంకర్ యాదవ్‌కు నివాళి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు శంకర్ యాదవ్ మృతి చెందాడు. ఆయనపార్థివ దేహానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, టి.పద్మారావు గౌడ్, ప్రముఖులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. శ్మశాన వాటిక వరకు కొనసాగిన అంతిమ యాత్రలో పలువురు పాల్గొన్నారు.

వర్షాకాల ప్రణాళికపై నేడు సమీక్ష

సిటీబ్యూరో, జూన్ 11 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వర్షాకాలానికి సంబంధించి ఆయా ప్రభుత్వ శాఖలు తీసుకుంటున్న ఏర్పాట్లపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరగనున్న సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యుత్, పోలీస్ శాఖ అధికారులు పాల్గొంటారు. జీహెచ్ఎంసీ పరిధిలో జరుగుతున్న నాలా అభివృద్ధి (ఎస్ఆర్‌డీపీ) పనులు, ఎస్ఎన్‌డీపీ పనులతో పాటు శిథిల భవనాలపై స్పెషల్ డ్రైవ్, నాలా పూడికతీత పనులు, వర్షాకాల ప్రణాళికల అమలుపై జీహెచ్ఎంసీ అధికారులతో మంత్రి చర్చించనున్నారు. లోతట్టు ప్రాంతాలు, చెరువుల సమీపంలో ఉండే వారిని అప్రమత్తం చేసే చర్యలపై చర్చించి నిర్ణయాలు వెల్లడించనున్నారు.

డీ.పోచంపల్లిలోని సర్వేనంబర్ 168లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

దుండిగల్, జూన్ 11: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో అధికారులు అక్రమ నిర్మాణాలను మంగళవారం కూల్చివేశారు. అలాగే చెరువులను ఆక్రమించి ఎఫ్‌టీఎల్ (ఫుల్‌ట్యాంక్ లెవల్) పరిధిలో నిర్మించిన భవనాలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నేలమట్టం చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, డి.పోచంపల్లిలోని సర్వే నంబర్ 168లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో మొత్తం 4 నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ఇందులో కొన్ని భవనాలకు స్టిల్ట్+2 అంతస్తులకు అనుమతులు తీసుకుని అంతకుమించి నిర్మిస్తుండగా, అనుమతులు తీసుకోకుండానే ఐదారు అంతస్తుల వరకు నిర్మిస్తుండటంతో నిర్మాణాలను నేలమట్టం చేశారు. అలాగే డి.పోచంపల్లిలోని చింతలకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మిస్తున్న భవనాన్ని అధికారులు కూల్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని అధికారులు హెచ్చరించారు.

జలమండలిలో బదిలీలు షురూ

వారం రోజుల వ్యవధిలో ట్రాన్స్‌ఫర్ ప్రక్రియను పూర్తి చేసే దిశగా కసరత్తు

సిటీబ్యూరో, జూన్ 11 (నమస్తే తెలంగాణ) : జలమండలిలో సమూల ప్రక్షాళనపై ఎండీ సుదర్శన్ రెడ్డి దృష్టి సారించారు. ఈ మేరకు జీపీఈ (జనరల్ పర్పస్ ఎంప్లాయీ) మొదలుకొని డైరెక్టర్ల వరకు బదిలీలు జరిపేందుకు కసరత్తు ప్రారంభించారు. ఐదేళ్లుగా ఒకే స్థానంలో కొనసాగుతున్న వారికి తొలుత స్థానం చలనం ఉంటుంది. ప్రధానంగా అవినీతి ఆరోపణలు, వివాదాస్పద అధికారులు, ఐదేళ్లు పైబడి ఒకే స్థానంలో ఉన్న వారిని కచ్చితంగా ఇతర చోట్లకు మార్చనున్నారు. కొన్ని డివిజన్లలో ప్రజాప్రతినిధుల అండతో ఇంజినీర్లు (డీజీఎం, జీఎం) స్థాయిలో ఏండ్ల తరబడి కొనసాగుతున్నారు. అయితే అటు బదిలీల జాబితా సిద్ధమవుతుందో లేదో అప్పుడే కొందరు పైరవీలకు తెర లేపినట్లు చర్చ జరుగుతున్నది. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో ఉన్న డివిజన్‌లో ఉన్న జీఎం, డీజీఎంలు పైరవీలతో యథావిధిగా కొనసాగేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మెయింటెనెన్స్ విభాగంలో ఉండే కొందరు ఇంజినీర్లు ప్రాజెక్టు విభాగంలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు ఉద్యోగుల్లో చర్చ జరుగుతున్నది. మొత్తంగా బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందా? లేదంటే పైరవీల జాతర నడుస్తుందో వేచి చూడాల్సిందే.

నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం

అలియా స్కూలులో ప్రారంభోత్సవ కార్యక్రమం.. హాజరుకానున్న నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం



సిటీబ్యూరో, జూన్ 11 (నమస్తే తెలంగాణ) : వేసవి సెలవులు ముగిశాయి. బడులు తెరుచుకోనున్నాయి. హైదరాబాద్ జిల్లాలో బుధవారం అన్నీ ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది విద్యాసంవత్సరం షురూ కానుంది. జిల్లాలో 768 పాఠశాలలు ఉన్నాయి. 1,34,476 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికే అన్నీ ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు, నోట్ బుక్స్ వంద శాతం పంపిణీ చేశామని హైదరాబాద్ డీఈఓ రోహిణీ తెలిపారు. యూనిఫామ్‌లను కూడా పంపించామని చెప్పారు. కాగా నాంపల్లిలోని అలియా ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ ఇన్‌చార్జి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హాజరు కానున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల్ని ప్రోత్సహించడానికి ప్రారంభించిన బడిబాట కార్యక్రమం జూన్ 19 వరకు కొనసాగనుంది. కాగా, పాఠశాలలు ఎప్పటిలాగానే ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నారు. డ్రాపౌట్లు లేకుండా పాఠశాలల్లో హాజరుశాతం పెంచడానికి పేరెంట్స్ కమిటీలు, విద్యా కమిటీలు, స్థానిక స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులను భాగస్వాములను చేయాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.అంతేకాదు ప్రతీనెల నాల్గో శనివారం 'నో బ్యాగ్ డే' అమలు చేయనున్నారు.

బస్సుల సంఖ్య పెంచండి

మహాలక్ష్మి పథకంతో ఇప్పటికే ప్రయాణికులతో బస్సులు నిండిపోతున్నాయి. ఈ ప్రభావంతో బస్సుల రాకపోకల్లోనూ ఆలస్యమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో నేటి నుంచి స్కూల్స్ ప్రారంభమవుతున్నాయి. సమయానికి చేరుకోవాల్సిన విద్యార్థులకు ఇప్పుడు బస్సులో ప్రయాణం కష్టంగా మారనుందని శేఖర్ అనే విద్యార్థి తెలిపాడు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో బస్సుల సంఖ్య పెంచాలని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీకి విద్యార్థులు విజ్ఞప్తి చేశారు.

మ్యాన్‌హోల్ తీస్తే..

జరిమానాతో పాటు జైలు

జలమండలికి సమాచారం లేకుండా మూతలు తెరవొద్దు

పౌరులకు ఎండీ సుదర్శన్ రెడ్డి హెచ్చరిక

సిటీబ్యూరో, జూన్ 11 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లోని రహదారులు, ఇతర ప్రాంతాల్లో ఉన్న మ్యాన్‌హోల్స్ తెరిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. వర్షాకాల నేపథ్యంలో జలమండలికి సమాచారం లేకుండా ఎవ్వరూ మ్యాన్‌హోల్ తెరవొద్దని సూచించారు. ఎవరైనా పౌరులు, అనధికార వ్యక్తులు, అధికారుల అనుమతి లేకుండా మ్యాన్‌హోళ్లపై ఉన్న మూత తెరిచినా, తొలగించినా.. జలమండలి యాక్ట్-1989 సెక్షన్ 74 ప్రకారం నేరమన్నారు. దీనిని అతిక్రమించి ఇలాంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులతో పాటు నిందితులకు జరిమానా విధించడంతో పాటు కొన్ని సార్లు జైలు శిక్ష కూడా వేసే అవకాశముందని ఎండీ చెప్పారు. వర్షాకాల ప్రణాళికలో భాగంగా ఇప్పటికే అన్ని రకాల చర్యలు తీసుకుందని వెల్లడించారు. లోతైన మ్యాన్‌హోల్స్‌తో పాటు 25 వేలకు పైగా మ్యాన్‌హోళ్లపై ఇప్పటికే సేఫ్టీగ్రిల్స్ బిగించామని, ప్రధాన రహదారుల్లో ఉన్న వాటిని కవర్స్‌తో సీల్ చేసి రెడ్ పెయింట్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ బృందాలు (ఈఆర్టీ), సేఫ్టీ ప్రొటోకాల్ టీమ్ (ఎస్పీటీ) వాహనాలను రంగంలోకి దించామని, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలు అందజేశామని ఎండీ తెలిపారు. ఈ బృందాలకు కేటాయించిన వాహనాల్లో జనరేటర్‌తో కూడిన డీ వాటర్ మోటారు ఉంటుందని, దీని సాయంతో వర్షపు నీటిని తొలగిస్తారని చెప్పారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండి పనిచేస్తారని, అధికంగా నీరు నిలిచే ప్రాంతాలపై ఈ బృందాలు ప్రధానంగా దృష్టి సారిస్తాయన్నారు. వీటితో పాటు ఎయిర్‌టెక్ మిషిన్లు సైతం అందుబాటులో ఉంటాయని తెలిపారు. మ్యాన్‌హోల్స్ నుంచి తీసిన వ్యర్థాలు (సిల్ట్)ని ఎప్పటికప్పుడు తొలగిస్తారని ఎండీ పేర్కొన్నారు.

సెక్షన్‌కు ఒక బృందం ఏర్పాటు..



మ్యాన్‌హోల్స్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రతి సెక్షన్ నుంచి సీవర్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఒక సీవరేజీ బృందం ఏర్పాటు చేశారు. వీరు ఉదయాన్నే క్షేత్రస్థాయిలో వారి పరిధిలోని ప్రాంతాలకు వెళ్లి పరిస్థితి పర్యవేక్షిస్తారు. చౌకేజీ, వాటర్ లాగింగ్ పాయింట్లను జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయంతో ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తారు. ఎక్కడైనా మ్యాన్‌హోల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనించినా , ఇతర సమస్యలు, ఫిర్యాదులుంటే జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

కార్మికులకు శిక్షణ ..

పారిశుధ్య కార్మికులు, సిబ్బంది విధులు నిర్వర్తించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయాల్లో ఎలా పనిచేయాలనే విషయంపై వారికి జలమండలి ఏటా భద్రతా వారోత్సవాలు, పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భద్రతా పరికరాల పనితీరు, ఉపయోగించే విధానం, పారిశుధ్య పనుల్లో తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలపై శిక్షణ ఇస్తోంది. అంతేకాకుండా పని ప్రదేశాల్లో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు చేసే ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తుంది. వర్షాకాలంలో మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

గాజుల రామారం సర్వే నం.13లోని ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలు

రాత్రికి రాత్రే కబ్జా

గాజుల రామారంలో ఆక్రమణకు గురైన సర్వే నంబర్ 13లోని ప్రభుత్వ భూమి

నిర్మాణాలను తొలగించేందుకు యత్నించిన స్థానిక మహిళలు

దుండిగల్, జూన్ 11 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. కొందరు కింది స్థాయి రాజకీయ పార్టీల నాయకులు గ్రూపులుగా ఏర్పడి కబ్జాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తుండగా.. రెవెన్యూ అధికారులు తమవంతు సహకారం అందిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో గాజులరామారంలోని సర్వే నంబర్ 13లోని కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని స్వాహా చేయడమే లక్ష్యంగా రాజకీయ పార్టీల నాయకులు కబ్జాదారులను ముందుంచి కూల్చివేతలు జరిపిన చోటే మళ్లీ అక్రమంగా నిర్మాణం చేపడుతున్నట్లు బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నంబర్ 13లో గతంలో 5.37 ఎకరాలపైగా ప్రభుత్వ భూమి ఉండగా, కబ్జాల బారినపడి చివరకు 3 వేల చదరపు గజాల స్థలం మాత్రమే మిగిలింది. అయితే కొందరు అక్రమార్కులు సదరు 3వేల గజాల భూమిని సైతం వాటా లేసుకొని కబ్జా చేసేందుకు యత్నిస్తుండటం విస్మయపరుస్తోంది. కాని తాము పని చేస్తున్నామని ప్రజల్లో భ్రమలు కల్పించేందుకు అధికారులు అడపాదడపా చర్యలు తీసుకుంటున్నారు. సర్వే నంబర్ 13లో కోట్లు విలువ చేసే 3వేల చదరపు గజాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని పలు ఫిర్యాదులు అందినా.. రెవెన్యూ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇక్కడ హరితహారం మొక్కలు నాటారు. నేడు ఆ ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుంటే ఎవరూ స్పందించే పరిస్థితి లేదు. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన తాసీల్దార్ పట్టించుకోవడం లేదని, రెవెన్యూ అధికారులకు సైతం కబ్జాలో వాటా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

సెలవులో అధికారులు..

ఈ విషయమై కుత్బుల్లాపూర్ తాసీల్దార్ రెహమాన్, గిర్దావర్ రజనీకాంత్‌లను వివరణ కోరేందుకు యత్నించగా.. తాసీల్దార్ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. గిర్దావర్ రజనీకాంత్ మాత్రం తాను సెలవులో ఉన్నానని తెలిపారు. మరో గిర్దావర్ రేణుకను వివరణ కోరగా.. తమకు సిబ్బంది కొరత ఉందని, అక్రమ నిర్మాణాలను తొలగించాలంటే పోలీస్ ప్రొటెక్షన్ అవసరమని పేర్కొన్నారు. తాసీల్దార్ విధుల్లోకి రాగానే చర్యలు చేపడతామని చెప్పారు.

కూల్చివేతకు మహిళల యత్నం

కాగా సర్వేనంబర్ 13లోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన ఇంటివద్ద కాపలాగా నిర్మాణదారులు మనుషులను పెట్టారు. వారు పక్కనే ఉన్న ఇందిరమ్మ ఇండ్లకు చెందిన మహిళల పట్ల వెకిలిగా ప్రవర్తిస్తున్నారంటూ.. మంగళవారం పలువురు స్థానిక మహిళలు సదరు నిర్మాణాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న రాళ్లు, ఇటుకలతో గోడలను కూల్చేందుకు ప్రయత్నించగా సాధ్యం కాకపోవడంతో ఇంటిపై వేసిన రేకులను తొలగించారు. అయితే కాపలాకాస్తున్న వారు మద్యం సేవిస్తూ అసభ్యంగా ప్రవరిస్తున్నారని మహిళలు ఆరోపించారు.

పిల్లల చదువెట్లా?

ఆటో డ్రైవర్లకు కొత్త కష్టాలు

ఈ ఏడాది ఉపాధి లేక దయనీయం

పిల్లల ఫీజులు చెల్లించలేక అయోమయం

గిరాకీ లేక రోడ్డునపడ్డ ఆటోవాలాలు

సోషల్ మీడియాలో మరోసారి ఆటోడ్రైవర్ల సూసైడ్ నోట్ వైరల్

మంత్రి పొన్నం ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలన్నీ గాలికేనా?

కాంగ్రెస్ ఇస్తానన్న రూ.12వేల సాయం ఏదీ?

కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలంటూ భిక్షాటన చేస్తున్న ఆటోవాలాలు (ఫైల్)

మంత్రిగారు స్పందించండి..

స్కూళ్లు ప్రారంభమయ్యాయి. ఆటో డ్రైవర్లకు ఇల్లు గడవడమే కష్టంగా ఉంది. ఇప్పుడు స్కూల్ ఫీజులు ఎలా చెల్లించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ దృష్టికి టీఏటీయూ తరపున తీసుకెళ్లాం. మూడు సార్లు సమావేశాలు నిర్వహించారు..కానీ ఆటో డ్రైవర్లకు ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందలేదు. పిల్లల విద్యా భవిష్యత్తు కోసం సాయం అందించాలని కోరుతున్నాం.

- వేముల మారయ్య, టీఏటీయూ రాష్ట్ర అధ్యక్షుడు

సిటీబ్యూరో, జూన్ 11 (నమస్తే తెలంగాణ) : ఆటో డ్రైవర్లపై దెబ్బ మీద దెబ్బ పడుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచి ఆటోవాలాల బతుకు ధీనస్థితిలోకి వెళ్లిపోయింది. మహిళలకు ఉచిత బస్సు స్కీం ప్రవేశపెట్టడంతో ఆటోల చక్రాలకు బంధనాలు పడ్డాయి. గిరాకీ లేక రోడ్డునపడ్డారు. ఓ వైపు ఇంటి కిరాయిలు..మరోవైపు నిత్యావసర ఖర్చులు మొన్నటి వరకు వారిని వెంటాడితే.. ఇప్పుడు 'జూన్ 12' బడులు ప్రారంభం అనే గుదిబండా వారిపై పడింది. ఉపాధి లేక ఇల్లు గడవడమే గండంగా మారిన వారికి తమ పిల్లల స్కూల్ ఫీజులు కంటి మీద కునుకులేకుండా చేస్తుంది. ఆటోవాలాల బిడ్డల విద్యా భవిష్యత్తునూ కాంగ్రెస్ ప్రభుత్వం చిదిమేస్తోందని ఆటో సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బతకడం కోసం ఇప్పటికే నానాయాతన పడుతున్న ఆటో అన్నలు.. ఉపాధి లేక తల్లడిల్లుతున్నారు. బండి ఈఎంఐలు చెల్లించడమే గగనంగా మారింది. ఇప్పుడు తమ బిడ్డల స్కూల్ ఫీజులకు డబ్బులు ఎలా సమకూర్చాలో తెలియక సతమతమవుతున్నారు. ''ఈ ఏడాదికి ఫీజు తక్కువగా ఉన్న స్కూల్‌లో చేరండి, ప్రభుత్వ స్కూల్‌లో చదువుకోండి.. కోచింగ్, ప్రత్యేక ట్యూషన్లు వెళ్లాల్సినవసరం లేదు.. ఇంట్లోనే చదువుకోండి..'' అంటూ పిల్లలకు సర్ది చెప్పుకుంటున్నారు.

మరోసారి వైరల్‌గా ఆటోవాలాల సూసైడ్ రిపోర్ట్..!

ఆటో డ్రైవర్ల సూసైడ్ రిపోర్ట్ మరోసారి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ఉచిత బస్సు స్కీంతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని విమర్శించారు. ఈమేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ల వివరాలతో ' ఆటో డ్రైవర్ల సూసైడ్ రిపోర్ట్' సోషల్ మీడియాలో విరివిగా వైరల్ అవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం స్కీం ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 34 మందికి పైగా ఆటో డ్రైవర్లు చనిపోయారంటూ లిస్టును షేర్ చేస్తున్నారు. ఆ లిస్టుకు పేపర్ క్లిప్పింగ్స్, టీవీ చానళ్ల వీడియోలు జత చేస్తూ ఆధారాలతో షేర్ చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే వారి చావులపై హేళనగా మాట్లాడుతోందని నెటిజన్లు ఫేస్‌బుక్, ఎక్స్‌లో కామెంట్స్ పెడుతున్నారు. మృతులు సారయ్య, సతీశ్‌గౌడ్, సత్యనారాయణ, అనిల్, హమీద్, అక్బర్, రాహుల్, నగేశ్, అరుణ్‌కుమార్, రవి, రామలింగయ్య తదితరుల ఫొటోలతో షేర్ చేస్తూ వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.

"నగరానికి చెందిన ఆటో డ్రైవర్ నిరంజన్ తమ పిల్లలను ప్రైవేట్ స్కూలులో చదివిస్తున్నాడు. ఈ సారి ఉపాధి లేక ఇల్లు, ఈఎంఐ, నిత్యావసరాల ఖర్చులతో సతమతమైన అతడు తన బిడ్డను ప్రభుత్వ బడిలో చేర్పించాలని నిర్ణయించుకున్నాడు. నాల్గో తరగతి వరకు ప్రైవేట్ స్కూలులో చదివిన ఆ విద్యార్థి ఇప్పుడు ప్రభుత్వ స్కూలులో చదువనంటూ మారాం చేస్తున్నాడని నిరంజన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు." నగరంలో ఆటో డ్రైవర్ల పరిస్థితి నిరంజన్ లాగానే మారిందని మిగతా ఆటోవాలాలంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."

"ఆటో డ్రైవర్ రవికుమార్‌కు ఇద్దరు కూతుళ్లు. చిన్న బిడ్డని ఓ ప్రముఖ స్కూలులో చేర్పించాలని అనుకున్నాడు. అందుకు సంబంధించిన అడ్మిషన్ ప్రక్రియ కూడా ముగిసింది. కానీ గత మూడు నెలల నుంచి ఆటో గిరాకీ లేక ఇల్లు గడవడమే కష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆ స్కూల్ ఫీజు భరించగలమా? అని ఆందోళన చెందిన రవి కుమార్ ఆ అడ్మిషన్‌ను రద్దు చేసుకోవడానికి నిర్ణయించుకున్నాడు."

మంత్రి పొన్నం సమీక్షలు గాలికేనా..!

ఆటో డ్రైవర్లకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ చెప్పిన మాటలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. కనీసం ఆ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రతీ ఏడాది ఆటో డ్రైవర్‌కు రూ.12వేలు అనే హామీని కూడా అమలు చేయలేదు. హైదరాబాద్‌లో 1.20 మంది ఆటోడ్రైవర్లు ఉన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఇప్పటికీ మూడు సార్లు ఆటో డ్రైవర్లతో చర్చలు జరిగాయి. కానీ ఏ ఒక్క చర్చలో కూడా సమస్యలకు సరైన పరిష్కారం చూపలేదు. ఆటోలకు గిరాకీ లేదని.. తమకు న్యాయం చేయండి అంటూ నెత్తినోరు మొత్తుకున్నా స్పందించలేదు. రోడ్డెక్కి ధర్నాలు చేసిన ఫలితం లేదని ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు స్కూల్స్ ప్రారంభం అవుతుండటంతో పిల్లల విద్య దృష్టిలో పెట్టుకుని ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మిసెస్ వరల్డ్ ఇంటర్నేషనల్ 2024, సీజన్-2 అందాల పోటీల్లో హైదరాబాద్ నగరానికి చెందిన నిత్యాన్య 'మిసెస్ వరల్డ్ ప్రైడ్'గా నిలిచింది. ఈ అందాల పోటీలు ఢిల్లీ సమీపంలోని లీలా యాంబియన్స్ గుర్గావ్‌లో వైభవంగా జరుగగా.. మిసెస్ వరల్డ్ ప్రైడ్ ను గెల్చుకుంది.

- రవీంద్రభారతి, జూన్11

దావూద్ గ్యాంగ్‌తో సంబంధాలంటూ..

సిటీబ్యూరో, జూన్ 11 (నమస్తే తెలంగాణ): దావూద్ గ్యాంగ్‌తో సంబంధాలున్నాయని.. మీ ఆధార్‌కార్డుతో బ్యాంకు ఖాతాలు ఓపెన్ అయ్యాయని, మనీ లాండరింగ్ కేసు నమోదయ్యిందని బెదిరించి ఓ రిటైర్డు ఉద్యోగి నుంచి సైబర్‌నేరగాళ్లు రూ. 20 లక్షలు కొట్టేశారు. నగరానికి చెందిన బాధితుడికి ఒక కాల్ వచ్చింది. మీ ఆధార్ కార్డు దావూద్ ఇబ్రహీం గ్యాంగ్‌కు ఓ పొలిటీషియన్ ద్వారా చేరిందంటూ.. ఈ ఆధార్‌తో ముంబైలోని కొన్ని బ్యాంకుల్లో ఖాతాలు నగదు లావాదేవీలు జరిపి మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని చెప్పి.. అందుకు బ్యాంకు లావాదేవీలు తనిఖీ చేయాలంటూ వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆ తర్వాత వేరే వ్యక్తితో మాట్లాడించి, నగదు వివరాలు తెలుసుకున్నాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు తన అకౌంట్‌లో ఉన్న రూ. 20 లక్షలు సైబర్‌నేరగాళ్ల ఖాతాలోకి బదిలీ చేశాడు. ఇదంతా మోసమని గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.